విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



జగన్ పోరుబాట నిర్వహించడమా..?

● 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు డ్రామాలు

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ధ్వజం

మదనపల్లె టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో దోపిడీ చేసిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పట్టించి, అప్పులు పాలు చేశారని, ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక పరిస్థితిని నాశనం చేశారని, గ్రామాలు అభివృద్ధి లేక నిర్వీర్యం చేశారన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ 9 సార్లు విద్యుత్‌చార్జీలు పెంచి ప్రజలపై భారం వేసిన విషయం మరచిపోయి, ఇప్పుడు పోరుబాట పేరుతో రోడ్లలోకి వచ్చి డ్రామాలు ఆడుతున్నారన్నారు. శాండ్, వైన్, మైన్స్ స్కాంలతో కోట్లు దోచుకున్నారన్నారు. దీనికి నిదర్శనమే ప్రజలు గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. ట్రూఅప్ చార్జీలు, మున్సిపల్ పన్నులు, చెత్తపన్నులు వేసి ప్రజల రక్తం తాగారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పాలనను గాడిలో పెడుతోందన్నారు. ఒకటో తేదీ పింఛన్ల పంపిణీ, ప్రతి నెలా ఐదో తేదీలోపు ఉద్యోగులకు జీతాల చెల్లింపు, ఉచిత సిలిండర్ల పంపిణీ, రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలను పరిష్కారం చేస్తోందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో రూ.20 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తున్నామని, రూ.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటి వరకు 25 బోర్లు తవ్వించామన్నారు. వైసీపీ హయాంలో మదనపల్లె ప్రాంతంలో రూ.1500 కోట్ల భూస్కాం జరిగిందని, దీనిపై విచారణ చేస్తే అసలు విషయం బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, మోడెం సిద్ధప్ప, ఎస్‌ఏ మస్తాన్, నాగార్జున గాంధీ, మధుబాబు, నాగయ్య, చల్లా నరసింహులు, గుత్తికొండ త్యాగరాజు, జేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రద్దయిన ప్యాసింజర్ రైళ్లు

● బోసిపోయిన ములకలచెరువు రైల్వేస్టేషన్

● రెండు నెలల పాటు ఇదే పరిస్థితి

ములకలచెరువు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ములకలచెరువు మీదుగా గుంతకల్లు జంక్షన్‌కు నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దుతో ములకలచెరువు రైల్వేస్టేషన్ బోసిపోయి కళ తప్పింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగే కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు నాలుగు రైళ్లను మళ్లించడంతో ఈ పరిస్థితి నెలకొంది. తిరుపతి-గుంతకల్లు జంక్షన్ (07589), గుంతకల్లు-తిరుపతి(07655) రైళ్లు శనివారం రద్దు కాగా గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతి (07590), తిరుపతి-గుంతకల్లు (07656) రైళ్లు ఆదివారం నుంచి రద్దయ్యాయి. దీంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడిన రైల్వేస్టేషన్ ఆదివారం బోసిపోయింది. రెండు నెలల పాటు ఇదే పరిస్థితి కొనసాగనుంది. రైళ్ల రద్దు గురించి స్థానిక రైల్వే సిబ్బంది సమాచారాన్ని నోటీసు బోర్డులో అంటించారు. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రతిరోజు ధర్మవరం- నరసాపూర్, నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నడుస్తోంది. అలాగే సికింద్రాబాద్-తిరుపతి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వారానికి రెండు నుంచి నాలుగు రోజుల వరకు రైళ్లు నడుస్తున్నాయి. అయితే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ములకలచెరువులో ఆగడం లేదు. ప్యాసింజర్ రైళ్లు తిరిగి నడిపే వరకు ములకలచెరువులో అన్ని రైళ్లు నిలపాలని రైల్వే అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.



ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయడంతో వెలవెలబోతున్న ములకలచెరువు రైల్వేస్టేషన్

పరిశ్రమలు ఏవీ.?

● వైసీపీ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం
● చిన్న తరగతి పరిశ్రమలే దిక్కు..
● ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నైకి వెళుతున్న యువత
● కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు
● జిల్లాలో వెనుకబడ్డ పారిశ్రామిక రంగం

రౌండప్ 2024



కలికిరిలో నిరుపయోగంగా ఉన్న నిమ్జ్‌కు కేటాయించిన స్థలం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి జరగడం అత్యంత అవసరం. పరిశ్రమలు ఉన్నచోట ఉద్యోగాలతో పాటు పలువురికి ఉపాధి దొరుకుతుంది. చదువుకున్న వారికి పెద్ద ఉద్యోగాలు వస్తే.. చదువుకోని వారికీ వారి స్థాయిని బట్టి ఉద్యోగావకాశాలు దొరుకుతాయి. ఆ పరిశ్రమలను ఆధారం చేసుకుని ఇతర వ్యాపారాల వంటివీ జరుగుతాయి. జిల్లాలో సహజ వనరులకు, మానవ వనరులకు కొదవలేదు. జిల్లాలో పెద్ద పెద్ద విద్యాసంస్థలు, వేల సంఖ్యలో ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువత.. ఎక్కువగా మామిడి, టమోటా, బొప్పాయి, వరి, వేరుశనగ పంటల సాగు.. అటు బెంగళూరుకు, ఇటు చెన్నైకి మంచి రవాణా అవకాశాలు.. ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ.. జిల్లాలో ఒకటంటే ఒకటి.. కనీసం 500 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ కూడా లేదు. గత ఐదు సంవత్సరాల వైసీపీ నిర్లక్ష్యం వల్ల జిల్లా యువత, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. చాలీచాలని వేతనాల కోసం జిల్లాలోని యువతీ యువకులు పక్క రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికీ జిల్లాలో కేవలం చిన్నతరగతి పరిశ్రమలే ఆధారం.. అది కూడా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు వంటివే కావడం గమనార్హం. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాకపోగా కనీసం ఎన్నికల ఏడాది అయిన ఈ సంవత్సరం కూడా పరిశ్రమల ఊసే లేకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పరిశ్రమల వైపు ఎటువంటి అడుగులు పడలేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు పారిశ్రామికరంగం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలతో ఉన్నారు.

నట్టేట ముంచిన జగనన్న..

2019 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని, యువత చదువుకు తగ్గట్టు.. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిని నమ్మిన యువత 2019 ఎన్నికల్లో వైసీపీకి పట్టం కట్టింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలోనూ ఆ పార్టీకే బ్రహ్మరథం పట్టింది. అయితే అధికారం చేతికి రాగానే జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను పట్టించుకోలేదు. కనీసం ఒకటంటే ఒక కొత్త పరిశ్రమనూ తేలేదు. అసలు ఆవైపు ప్రయత్నమే చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వనరులు అనుకూలంగా ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా అరటి, బొప్పాయి. మామిడి, వేరుశనగ, టమోటా పంటలు సాగు చేస్తారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో అరటి, బొప్పాయి, మామిడి వంటి ఉద్యాన పంటలు సాగు చేస్తారు. రాయచోటి, పీలేరు ప్రాంతాలలో మామిడితో పాటు వేరుశనగ, టమోటా సాగు ఎక్కువగా ఉంటుంది. మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో వేల ఎకరాల్లో టమోటా సాగు చేస్తారు. మదనపల్లె ప్రాంతంలో గ్రానైట్ లభ్యత కూడా ఎక్కువే. ప్రస్తుతం జిల్లాలోనే ఎక్కువగా మదనపల్లె ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. అయితే ఇందులో ఏ ఒక పరిశ్రమలోనూ పట్టుమని 500 మందికి ఉపాధి దొరికే అవకాశం లేదు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రవాణాకు మంచి సౌకర్యాలు ఉన్నాయి. ఇన్ని వసతులు, సౌకర్యాలూ ఉన్నా వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికంగా ఎటువంటి అడుగులు వేయలేదు. జిల్లాలో ఎక్కడా పరిశ్రమల కోసమని కనీసం సెంటు భూమిని కేటాయించలేదు. పైసా నిధులు కేటాయించలేదు.

'నిమ్జ్'..చేజేతులా వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం

కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన సొంత నియోజకవర్గం పీలేరులోని కలికిరి వద్ద నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (ఎన్‌ఐఎంజడ్)ను ఏర్పాటు చేశారు. సాధారణ సెజ్‌లతో పోల్చితే సుమారు ఐదారు రెట్లు పెద్దదిగా ఉండే విధంగా రాయలసీమలోనే అతి పెద్ద పారిశ్రామికవాడను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే ఈ పారిశ్రామికవాడ కోసం సుమారు 12,500 ఎకరాలు సేకరించారు. అంతర్జాతీయ స్థాయి కలిగిన పెద్ద పెద్ద పరిశ్రమల ఏర్పాటే నిమ్జ్ లక్ష్యంగా కిరణ్‌కుమార్‌రెడ్డి దీనిని ఏర్పాటు చేశారు. అయితే తర్వాత 2014 నుంచి 2019 వరకు ఇక్కడ ఎటువంటి పురోగతి లేదు. 2019 నుంచి 2024 వరకు జగన్ ప్రభుత్వంలోనూ ఎటువంటి అడుగు ముందుకు పడలేదు. దీనిని అప్పటి ప్రభుత్వాలు అభివృద్ధి చేసి ఉంటే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఎంతో ఆసరాగా ఉండేదని స్థానికులు అంటున్నారు.

చిన్నతరహా పరిశ్రమలే దిక్కు

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో రూ.633 కోట్లతో 20,163 పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా 1,12,506 మందికి ఉపాధి లభిస్తోంది. ఈ పరిశ్రమల్లో ఎక్కువగా మహిళలు, అన్‌స్కిల్డ్ సిబ్బందే పనిచేస్తున్నారు. ఎంటెక్, ఎంబీఏ ఎంసీఏ, బీటెక్, ఇతర డిగ్రీలు చదువుకున్న వాళ్లకు చాలా తక్కువ ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఉన్న పరిశ్రమలనూ పరిశీలిస్తే.. ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనే ఉన్నాయి. పాల ఉత్పత్తులు, వేరుశనగ, మామిడి, పప్పుదినుసులు, టమోటా, బొప్పాయి వంటి రంగాలలో చిన్నతరహా పరిశ్రమలే ఉన్నాయి. ప్రభుత్వం చొరవ చూపి ఉంటే వేరుశనగ, టమోటా, బొప్పాయి, మామిడి ఉత్పత్తులతో మధ్య తరహా, లేదా పెద్ద తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు అవకాశాలు ఉన్నాయి. అయినా ఎందుకనో.. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటు జరగడం లేదు.

69 పరిశ్రమలు లక్ష్యం..

వచ్చిన దరఖాస్తులు 539

రాబోయే 2024-25 ఏప్రిల్ వరకు ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద 69 పరిశ్రమలు నెలకొల్పాలనే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు 539 దరఖాస్తులు వచ్చాయి. అందులో 197 దరఖాస్తులను అధికారులు అంగీకరించారు. రూ.245.71 లక్షల వ్యయంతో 67 పరిశ్రమలు మొదలు కాబోతున్నాయి.

అనేక పరిశ్రమలకు అవకాశం

జిల్లాలో దొరికే వనరులతో ఏర్పాటయ్యే పరిశ్రమలే కాకుండా ఇక్కడ పెద్ద తరహా పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో ఖాళీ భూములు వేల ఎకరాలు ఉన్నాయి. ఇక్కడ ఎటువంటి పరిశ్రమలైనా ఏర్పాటు చేయవచ్చు. రాయచోటి ప్రాంతంలో టెక్స్‌టైల్ పరిశ్రమకు ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ. జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులు అటు బెంగళూరు, ఇటు చెన్నైకి అనువుగా ఉంటాయి. ఈ రెండు పెద్ద పట్టణాలు 200 కిలోమీటర్ల దూరం లోపే ఉండడం విశేషం. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రవాణా చేయడానికి కూడా సౌకర్యంగా ఉంటుంది.

సోలార్ పరిశ్రమలు ఉన్నా.. ఉపాధి తక్కువే..

ప్రస్తుతం జిల్లాలో ఏడు సోలార్ పరిశ్రమలు ఉన్నాయి. అయితే వీటిలో ఉపాధి అవకాశాలు తక్కువనే చెప్పవచ్చు. గాలివీడు మండలం తూముకుంట (ఇక్కడే రెండు ఉన్నాయి) రామాపురం మండలం పొత్తుకూరుపల్లె, మదనపల్లె మండలం వేంపల్లె, గాలివీడు మండలంలో ఒకటి, తంబళ్లపల్లె మండలంలో కోసువారిపల్లె, గుర్రంకొండ మండలంలోని మర్రిమాకులపల్లెల్లో సోలార్‌ప్లాంట్లు ఉన్నాయి. ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఈ పరిశ్రమల వల్ల స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు కలగడం లేదు. టెక్నికల్ సిబ్బందిని వేరే ప్రాంతాల నుంచి ఎంపిక చేసుకుంటున్నారు. దీని వల్ల ఈ పరిశ్రమలు ఈ ప్రాంత వాసులకు పెద్దగా ఉపయోగపడలేదనే చెప్పవచ్చు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు.. జిల్లాలో ఉన్న వనరులను ఉపయోగించుకుని పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగావకాశాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలోని నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపైన కోటి ఆశలు పెట్టుకుని ఉన్నారు.

కడప-చిత్తూరు జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు



గువ్వలచెరువు సొరంగమార్గం పరిశీలన

రామాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో సొరంగ మార్గం ఏర్పాటులో భాగంగా ఆ ప్రాంతాన్ని ఢిల్లీకి చెందిన చీఫ్ ఇంజనీర్ రాహుల్ గుప్తా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు కిలోమీటర్లు పొడవు ఉండేలా ఈ సొరంగ మార్గాన్ని నిర్మించే అవకాశం ఉందన్నారు. ఘాట్ రోడ్డు కారణంగా వాహనాలు లోయలో పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్న విషయం గమనించిన కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో సొరంగమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన జాతీయ రహదారుల శాఖ రీజనల్ అధికారి లోకేశ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ హరిప్రసాద్, కడప ఈఈ భాస్కర్ రెడ్డి, ఏఈ విశ్వనాథ్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

బి.కొత్తకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు ఆదివారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విచ్చేశారు. కుటుంబసమేతంగా హిల్స్‌కు చేరుకుని ఉల్లాసంగా గడిపారు. అధికారిక పర్యటనలా కాకుండా సెలవు రోజున ఉపశమనం కోసం హిల్స్‌కు వచ్చినట్లు మండల అధికారులు తెలిపారు. కొండపై ఉన్న పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కుటుంబంతో కలిసి బస చేశారు. పోలీస్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఒకరోజు పర్యటన అనంతరం ఆయన జిల్లా కేంద్రానికి తిరిగి వెళ్లనున్నట్లు తెలిసింది.

తెగిపోయిన చిన్నారి చెయ్యి

● గానుగమిషన్‌లో పెట్టడంతో ప్రమాదం


బి.కొత్తకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గానుగమిషన్ (నూనె తీసే యంత్రం)లో చేయి పెట్టిన ఓ బాలుడు తన చేతిని పోగొట్టుకున్న సంఘటన ఆదివారం బి.కొత్తకోట పట్టణంలో జరిగింది. పట్టణంలోని పోస్టాఫీసు వీధిలో నివశించే నూరుల్లా, షాహీనాల కుమారుడు అయాన్ (8) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన తండ్రితో కలిసి బెంగళూరు రోడ్డులోని గానుగమిషన్‌కు శెనగనూనె ఆడించుకునేందుకు వెళ్లాడు. అక్కడ తండ్రి తన పనిలో తాను ఉండగా బాలుడు మిషన్‌లో తన చేతిని పెట్టడంతో కుడిచెయ్యి సగం వరకు తెగిపోయింది. దీంతో వెంటనే బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కుటుంబీకులు బెంగళూరుకు తరలించారు.



ప్రమాదవశాత్తు కుడిచెయ్యిని కోల్పోయిన అయాన్

ఆనందాలు మెండు.. హార్సిలీహిల్స్ చెంత..

● పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న హిల్స్
● ఆహ్లాదకర వాతావరణంతో ఊటీని తలపిస్తూ..
● సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆనందాల వేదిక
● హార్సిలీహిల్స్ అందాలు చూతము రారండి



అందాల హార్సిలీహిల్స్ ఏరియల్ వ్యూ

బి.కొత్తకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్.. కొత్తగా పరిచయం అక్కరలేని ప్రముఖ పర్యాటక కేంద్రం. ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధి చెందిన ఈ అందాలకొండ అనేక ప్రాధాన్యతలు, ప్రత్యేకతలు కలిగి ఉండి పర్యాటకులను ఆకర్షిస్తోంది. హార్సిలీహిల్స్‌కు ఘాట్ రోడ్డు ప్రయాణం, పైనున్న సుందర ప్రదేశాలు, మేఘాలలో విహరిస్తున్నట్లు కలిగే అనుభూతి, పొగమంచుతో కూడిన అతి చల్లని గాలులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఇంటి భోజనం వెంటబెట్టుకొని కుటుంబసమేతంగా వచ్చి ఆరుబయట వనభోజనం చేసే సామాన్యుల నుంచి నైట్‌లైఫ్‌ను ఎంజాయ్ చెయ్యాలనుకునే సంపన్నుల వరకు ఎవరికి తగిన సదుపాయాలు వారికి ఉండటంతో ట్రిప్ అనగానే అందరికీ బి.కొత్తకోట మండల పరిధిలో ఉన్న హార్సిలీహిల్స్ గుర్తుకు వస్తుంది. వేల మంది పర్యాటకులు హిల్స్‌కు వచ్చి తమ రేంజ్‌కు తగ్గ ఎంజాయ్ చేసి వెళుతుంటారు.

హార్సిలీహిల్స్ ప్రత్యేకత..

హార్సిలీహిల్స్ అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉండటంతో పాటు కొండపైన 105 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పూర్వం ఏనుగుమల్లమ్మ కొలువుదీరిన ఈ కొండను హార్సిలీ అనే బ్రిటీష్ అధికారి గుర్తించి అభివృద్ధి చేయడంతో హార్సిలీహిల్స్‌గా రూపాంతరం చెందింది. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ నేడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది. ఈ కొండ ఘాట్ రోడ్డు ప్రయాణంలో మలుపులు, పైకి వెళ్లే కొద్దీ ప్రకృతి అందాలు చూడముచ్చటగా ఉంటాయి. హిల్స్‌పై ఊటీని తలపించే చలిగాలులు, విమానంలో నుంచి కిందికి చూస్తున్న అనుభూతి కలిగించే పాత, కొత్త వ్యూపాయింట్లు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వినోదంతో పాటు ఆధ్యాత్మికత కోసం హిల్స్‌పై ఉన్న పురాతన ఏనుగుమల్లమ్మ ఆలయంతో పాటు, ఘాట్‌రోడ్డులో తిరుమల కొండ ఎత్తుకు సమానమైన ప్రదేశంలో శ్రీవారి పాదాల స్థూపాన్ని నిర్మించారు.



మానస సరోవరంలో ఆహ్లాదకరంగా బోటింగ్

పర్యాటకులను రంజింపజేసే ఎన్నో ప్రదేశాలు

హార్సిలీహిల్స్‌లో పర్యాటకులను రంజింపజేసే అనేక ప్రదేశాలున్నాయి. వ్యూపాయింట్లతో పాటు, సేద తీరేందుకు విశాలమైన గాలిబండ, గవర్నర్‌బంగళా, జమున బిల్డింగ్, యువత కోసం సాహసక్రీడలు, అటవీ శాఖ ప్రాంగణంలో జూ, పక్షులపార్కు, మానససరోవరంలో బోటింగ్, అందమైన పార్కులు, సుందరమైన దృశ్యాలు కట్టిపడేస్తాయి. ప్రతి ప్రదేశంలోనూ తీసుకునే ఫొటోలు, వీడియోలు అందమైన జ్ఞాపకాలుగా నిలుస్తాయి.



ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్



ప్రకృతి అందాలను చూపించే కొత్త వ్యూపాయింట్

ఆధునిక సౌకర్యాలతో గెస్ట్‌హౌస్‌లు..

హార్సిలీహిల్స్‌లో ఆనందంగా గడపాలి అనుకునే పర్యాటకులకు ఆధునిక సౌకర్యాలకూ కొదవలేదు. ఆన్‌లైన్‌లో ఏపీటీడీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో గెస్ట్‌హౌస్‌లను బుక్ చేసుకోవచ్చు. రూ.1000 సామాన్యగది నుంచి రూ.10 వేల విలాసవంతమైన గెస్ట్‌హౌస్ వరకు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లు సైతం అన్నిహంగులతో పర్యాటకులకు సేవలందిస్తున్నాయి. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నడిచే హరిత రెస్టారెంట్‌లో వెజ్, నాన్‌వెజ్ వంటకాలు, మద్యం ప్రియుల కోసం బార్ కూడా అందుబాటులో ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ కంపెనీలు నిర్వహించే ఈవెంట్‌లకు, వీకెండ్ పార్టీలకు హార్సిలీహిల్స్ వేదికగా మారింది. సొంత వాహనాలు లేనివారి కోసం కొండ ముఖద్వారంలో ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి. మదనపల్లె నుంచి ఆర్టీసీ బస్సులు సైతం పరిమితంగా అందుబాటులో ఉంటాయి. హార్సిలీహిల్స్ వినోదయాత్ర మళ్లీ మళ్లీ రావాలనిపించే అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు.



ఆధునిక హంగులతో ప్రైవేటు కాటేజీలు

హార్సిలీహిల్స్‌కు చేరడం ఎలా?

జిల్లాలోని బి.కొత్తకోట మండల పరిధిలో ఉన్న హార్సిలీహిల్స్‌కు అన్ని మార్గాల నుంచి సునాయాసంగా చేరుకోవచ్చు. ములకలచెరువు-మదనపల్లె జాతీయ రహదారిలో కాండ్లమడుగు క్రాస్‌లో దిగాల్సి ఉంటుంది. అక్కడి నుంచి 1.50 కి.మీ దూరంలో హార్సిలీహిల్స్ ముఖద్వారం ఉంటుంది. అక్కడి నుంచి ఘాట్‌రోడ్డులో 7 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. అనంతపురం వైపు నుంచి కదిరి, ములకలచెరువు మీదుగా హిల్స్ క్రాస్‌కు చేరవచ్చు. రాయచోటి నుంచి మదనపల్లె మార్గంలో అంగళ్లు గ్రామంలో దిగి, మదనపల్లి-బి.కొత్తకోట మార్గంలో హిల్స్‌కు చేరవచ్చు. కర్ణాటకలోని చింతామణి వైపు నుంచి అయితే తాడిగోళ్ల క్రాస్-గోనిపల్లె-బి.కొత్తకోట మీదుగా హిల్స్‌కు చేరుకోవచ్చు.

బీసీలకు రాయితీ రుణాలు

● ప్రభుత్వానికి ప్రతిపాదనలు

● 5032 మందికి రూ.79.78కోట్ల ప్రయోజనాలు

కడప ఎన్జీఆర్ సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా రాయితీ రుణాలు అందించి బీసీ సామాజిక వర్గాల్లో వేలాదిమందికి వివిధ రకాల ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రతిపాదనలు పంపాలంటూ ఆదేశాలు ఇచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ ఐదేళ్ల పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చిన పరిస్థితి లేదు. 2014-2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన అనంతరం లోటు బడ్జెట్ ఉన్నప్పటికి బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ రాయితీ పథకాలను అమలు చేసిన పరిస్థితి ఉంది. ఇపుడు కూటమి ప్రభుత్వంలో అతిపెద్ద పార్టీగా టీడీపీ పేద ప్రజలకు జీవనోపాదులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక మిగిలింది మూడు నెలలు మాత్రమే. ఈ వ్యవధిలో సమయానికి తగిన విధంగా ప్రతిపాదనలు రూపొందించమని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం తాజా ప్రతిపాదనలు రూపందించి ప్రభుత్వానికి నివేదించింది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... బ్యాంకు లింకేజీతో కూడిన స్వయం ఉపాధి పథకాలకు బీసీ కార్పొరేషన్ రాయితీ ఇవ్వనుంది. 1550 మందికి రూ.31కోట్లు ప్రయోజనం చేకూరనుంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వనుంది. ఈ పథకం ద్వారా 61 మందికి రూ.7.33కోట్లు రుణాలు మంజూరు కానున్నాయి. పాడి పరిశ్రమ ద్వారా బీసీ సామాజిక వర్గాలకు చెందిన 500 మందికి రూ.25కోట్లు మినీ డెయిరీలు మంజూరు చేయనున్నారు. కురబ, యాదవులకు మేకలు, గొర్రెల పెంపకం కోసం 105 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.10కోట్ల రుణాలు అందించనున్నారు. మేదర, కుమ్మరి, శాలివాహనులకు చెందిన వారికి స్వయం ఉపాధి కల్పన కోసం 118 మందికి రూ.3.54 కోట్లు, బీసీ నిరుద్యోగ యువతకు జనరిక్ మెడికల్ షాపులు 32 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.56 కోట్లు, బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద ఫ్యాషన్ డిజైనింగ్‌కు 1770 యూనిట్ల కోసం రూ.4.43 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద శిక్షణ కార్యక్రమం 350 యూనిట్లకు రూ.1.75కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆసుపత్రి సెక్టార్ కింద శిక్షణ కార్యక్రమ 350 యూని ట్లు రూ.0.87కోట్లు ఖర్చు చేయనున్నారు. వడ్రంగి కింద శిక్షణ కార్యక్రమం 200యూనిట్లకు రూ.1.20కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు.

5036యూనిట్లకు రూ.79.78కోట్లు

బీసీ సామాజిక వర్గాల్లోని వివిధ ఉపకులాలకు ప్రయోజనం కలిగేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు బీసీ కార్పొరేషన్ అధికార యంతారంగం చెబుతోంది. మొత్తం 5036 యూనిట్లకు గాను రూ.79.78 కోట్లు ప్రతిపాదనలు రూపొందించి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఆర్థిక సంవత్సర చివరి నాటికి గ్రౌండింగ్ చేసే దానికి అవకాశాలు ఉన్నాయి. ముందుగా అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తు గడువు ముగియగానే అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఇప్పటికే వివిధ కులసంఘాల నాయకులు అధికారులను కలిసి నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయాలంటూ విన్నవిస్తున్నారు. సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బీసీ కార్పొరేషన్ వైపు వివిధ సంఘాల నాయకులు కన్నెత్తి చూసింది లేదు. ఇపుడు ప్రభుత్వం మారడంతో బీసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రతిపాదనలు ఆమోదించగానే యూనిట్ల మంజూరు



ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని బీసీలకు రాయితీ రుణాలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే జిల్లా కలెక్టర్ అనుమతితో అమలు చేయడం జరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

- జయసింహ, ఈడీ,బీసీ కార్పొరేషన్

ఉద్యోగావకాశాలకు క్రీడలు దోహదం

● జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగావకాశాలు పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని.. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ కోటాను ఉద్యోగ కల్పనలో అమలు చేస్తున్నదని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో 50వ జిల్లా కబడ్డీ జూనియర్ బాల, బాలికల ఎంపికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే ఏ క్రీడల్లో అయినా ప్రతిభ చాటవచ్చన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే జనవరి 3 నుంచి 6వ తేదీ వరకూ కర్నూలు పట్టణంలో జరుగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి వుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి జనార్థన్, కో-ఆర్డినేటర్ సంపత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

పవన్, వంశీ, విజయేంద్రప్రకాష్, బి.లోకేష్, బి.శివకుమార్, టి.ఉదయ్‌కుమార్, డి.నవనీత్, పి.సుదర్శన్, జి.రెడ్డిప్రసాద్, డి.వర్ధన్, ఎస్.విష్ణు, ఎస్.రిహాన్ బాషతో పాటు స్టాండ్ బైగా ఎస్.చంటి, వై. శ్రీవిష్ణు, కె. మణికంఠ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో ...

పి.నాగశృతి, ఎస్.శ్యామల, కె.వెంకట పల్లవి, ఎన్.నవనీత, కె.హేమవర్షిణి, బి.భవానీ, పి.అనుదీక్షిత, ఎం.ప్రమీల, సాయిహర్షిత, గురు స్పందన, టి.సౌమ్య, శ్రీ వర్షిత, జె.అనూషతో పాటు స్టాండ్‌బైగా ఆర్.అనురాధ, టి. శిరీష, బి.నిహితరెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

గువ్వల చెరువు ఘాట్‌లో అదుపుతప్పిన లారీ

● తప్పిన పెను ప్రమాదం



సికెదిన్నె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆదివారం లారీ అదుపు తప్పి లోయలో పడిన ప్రమాదంలో డ్రైవర్ క్రిష్ణ, క్లీనర్ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె పోలీసులకు వివరాల మేరకు... కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో రాయచోటి వైపు నుంచి కడపవైపునకు జూస్ లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా ప్రహరీగోడను ఢీకొట్టి నిలిపే ప్రయత్నం చేసినప్పటికి పది అడుగుల లోయలో పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ

సింహాద్రిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెకుంట్లలో జరిగిన నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆదివారం పులివెందుల ఆర్డీఓ జి.చిన్నయ్య, తహసీల్దార్ నాగేశ్వరరావులు విచారణ చేపట్టారు. నాగేంద్ర సాగు చేస్తున్న చీనీ తోటను, అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నాగేంద్ర ఇంటిలో భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు నాగేంద్ర బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ సమక్షంలో నాగేంద్ర ఇంటిలోని బీరువాలో వున్న వస్తువులను ఎస్‌ఐ తులసీనాగేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు ఏమైనా దొరుకుతాయేమోనని బీరువాలు, ఇంటిలోని పరిసరాలు పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ హరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.



నాగేంద్ర తోట వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య,రెవిన్యూ అధికారులు

నిజ నిర్ధారణలో తేలిన వాస్తవాలను ఆయన విలేకరులకు వివరించారు. దీనికంతటికి కారణం నాగేంద్రకు ఉన్న ఒకటిన్నర ఎకరాల పొలమే కాకుండా 13 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. గత ఆరు ఏడేళ్లగా పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెడుతూ సుమారు 30 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చినవారు వత్తిడి చేయడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దిక్కుతెలియనిస్థితిలో కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి వ్యవసాయాన్ని నమ్ముకుని పెట్టుబడి కూడా రాకపోవడంతో నాగేంద్ర కుటుంబం ఆత్మ హత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే పాలకులు రైతాంగం కోసం వ్యవసాయానికి పెట్టుబడి నిధులు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డయ్య, సహాయ కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

దుద్దెకుంట్ల గ్రామంలో జరిగిన కొమెర నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నాగేంద్ర కుటింబీకుల ఆత్మహత్యలపై పౌరహక్కుల సంఘం కడప జిల్లా శాఖ

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి



వడ్డెర మహాగర్జనలో మాట్లాడుతున్న ఏపీ వడ్డెర రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి

పెద్దమండ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి సమీపంలో జిల్లా వడ్డెర సంఘం మహాగర్జన కార్యక్రమం మండల వడ్డెర సహకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వడ్డెర రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ వడ్డెర హక్కుల సాధనకు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. వడ్డెరలకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ వడ్డెరులను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారు తప్ప రాజకీయంగా గుర్తింపు ఇవ్వలేదని, రాష్ట్రంలో 40 లక్షల మంది వడ్డెరలు ఉన్నా తగిన న్యాయం జరగలేదన్నారు. జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు డేరంగుల నారాయణ, తంబళ్లపల్లి నియోజకవర్గ వడ్డెర అధ్యక్షుడు నాగమల్లప్ప, డాక్టర్ లక్ష్మీప్రసాద్, శంకరప్ప సాంబశివ, ఎంఎల్ రమణ, హరి, మేకల చలపతి, జిల్లా, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వడ్డెరలు పాల్గొన్నారు.

పెద్దదర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కడప క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కడప అమీన్‌పీర్‌దర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ముత్తవల్లి షకీల్ షఫీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పెద్ద దర్గా గౌరవాన్ని తీస్తుండడంతో దర్గా సంబంధించిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శించిన మంత్రులు, పార్టీల నేతలు



రామచంద్రయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఫరూఖ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, విష్ణుస్వరూప్ అంత్యక్రియలకు హాజరైన వివిధ పార్టీల నాయకులు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. విష్ణుస్వరూప్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కడపకు తీసుకొచ్చారు. ఆదివారం కో-ఆపరేటివ్ కాలనీలోగల సీఆర్‌సి గృహంలో భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు.

కన్న కొడుకు మృతితో తీవ్ర మనోవేదనకు గురైన రామచంద్రయ్యను పలువురు నేతలు పరామర్శించారు. వారిలో రాష్ట్ర మంత్రి ఫరూఖ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బాబూరావు, టింబర్‌డిపో శ్రీనివాసులు, సంగం అదినేత నసీరుద్దీన్, బద్వేల్ టీడీపీ నాయకులు రాంబాబు, వైసీపీ నాయకులు అంజాద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తులసిరెడ్డి, మాజీ నాయకులు నజీర్ అహ్మద్, జనసేన జిల్లా కన్వీనర్ సుంకర శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు వీవీ చలపతి, పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, రామసుబ్బారెడ్డి, (వైసీపీ), బత్యాల చెంగల్‌రాయులు, (టీడీపీ), రమేష్‌రెడ్డి (వైసీపీ), ఆరిఫుల్లా (టీడీపీ) తదితరులతో పాటు ఎలువురు కార్పోరేటర్లు, అభిమానులు, మిత్రులు, బంధువులు ఉన్నా రు. కాగా, ఆదివారం మధ్యాహ్నాం చలమారెడ్డిపల్లెలోని రామచంద్రయ్య సొంత పొలంలో విష్ణుస్వరూప్ అంత్యక్రియులు నిర్వహించారు.

రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక



ఎం.అబ్దుల్ రషీద్, వసీవుల్లా బఖ్తీయారి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ వసీవుల్లా బఖ్తీయారి, ఎం.అబ్దుల్ రషీద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప నగరం రూట కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూట) ఆద్వర్యంలో రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ ఏర్పాటు చేశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ రూట ఆధ్వర్యంలో ఉర్దూ మీడియంను అంగన్వాడీల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు స్థాపనకు, పటిష్ఠపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చీఫ్ పాటర్న్‌గా సయ్యద్ హిదాయతుల్లా, గౌరవ అధ్యక్షులుగా హఫీజ్, షేక్ అహ్మద్ సలహాదారులుగా డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, డాక్టర్ ఎస్.అయ్యూబ్ హుస్సేన్, రాష్ట్ర సమన్వయకర్తగా షేక్ ముహమ్మద్ అయ్యూబ్ ఎంపికయ్యారు.

పూర్తి పింఛన్ ఇప్పించండి సారూ...

● శారీరక, మానసిక రోగి తల్లిదండ్రుల వినతి

పెండ్లిమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మా బిడ్డకు నరాల జబ్బు.. ఎన్నో ప్రాంతాలు తిరిగాం.. రూ.లక్షలు అప్పు చేసి ఖర్చు చేశాం. నయం కాలేదు. మంచానికే పరిమితమయ్యాడు. అప్పులపాలయ్యాం. కుటుంబాన్ని పోషించుకునేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. అన్ని అర్హతలూ ఉన్న మా బిడ్డకు పూర్తి పించన్ ఇచ్చి ఆదుకోండి సారూ...' అంటూ ఓ వ్యాధిగ్రస్థుడి తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. ఆ వివరాలు ఇవీ....

మండల పరధిలోని నాగాయపల్లెలో మైసూరారెడ్డి, రాములమ్మ దంపతులకు ఒక కుమారుడు రామసుబ్బారెడ్డి, కుమార్తె స్వాతి ఉన్నారు. ఒక ఎకరం పొలం ఉంది. ఆ దంపతులిద్దరు తమ పొలంలో వ్యవసాయ చేసుకుంటూ కూలి పనులకు వెళుతూ పిల్లలను పెంచి పెద్ద చేశారు. కుమారుడు రామసుబ్బారెడ్డి ఇంటర్ వరకు బాగా చదువుకుంటూ ఆరోగ్యంగా ఉండేవాడు. ఏమైందో ఏమో కానీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి నరాలు పనిచేయడం మానేశాయి. ఏమైందో అర్థం కాక అతని తల్లిదండ్రులకు బెంగుళూరు, చెన్నై, విజయవాడ, కేరళ ఇలా ఎన్నో ఆసుపత్రులకు కుమారుని



దివ్యాంగుడు రామసుబ్బారెడ్డి



రిమ్స్ వైద్యులు జారీచేసిన దివ్యాంగుల అర్హత ధ్రువీకరణ పత్రం

ఆరోగ్యం బాగుచేయాలని తిరిగినా ఫలితం లేదు. రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తూ ఉండే తప్ప మెరుగు పడడం లేదు. వృద్ధాప్యంలో ఆసరాగా కొడుకు ఉంటాడని రూ.20లక్షల అప్పు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగినా జబ్బు నయం కాలేదు. ఇక తల్లిదండ్రులు చేసేది లేక కూలినాలి చేసుకుంటూ మంచంపై ఉన్న తన కుమారుని బాగోగులు చూసుకుంటున్నారు. మంచంపైనే కాలకృత్యాలను చేయాలి. భోజనం తినిపించడానికి అరగంట పడుతుంది. 20 రోజులకు 30 రోజులకు ఒకసారి అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లాలి. చేతికి అందివచ్చిన కొడుకు ఇలా అయ్యేసరికి కూలి పనులు చేసుకునే మేము కూడా నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయామని యువకుడి తల్లిదండ్రుల ఆవేదన చేస్తున్నారు. ప్రస్తుతం దివ్యాంగుల పింఛన్ కింద రూ.6వేలు ఇస్తున్నారని, రూ.15వేలు దివ్యాంగుల పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్న సాంకేతిక కారణాలు చూపుతున్నారని.. దయచేసి అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

గండికోట చరిత్రను యువత తెలుసుకోవాలి

● నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతేశంలో సహజసిద్దంగా ఏర్పడిన గండికోటను యువత సందర్శించడం శుభపరిణామమని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గండికోటను విశాఖ జిల్లా యువత సందర్శించారు.

భారతదేశంలో సహజ సిద్ధంగా ఏర్పడిన పుణ్యస్థలం గండికోట అన్నారు. ఇతర జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సదర్శించడం వలన పురాతనమైన కట్టడాలపైన యువతకు అవగాహన ఏర్పడుతుందన్నారు. పురాతన చరిత్రను, స్థలాలను యువతరానికి అందించడం కోసం ప్రతి ఒక్కరు విశేష కృషి చేయాలన్నారు. కోటలో ఉన్న పురాతన శాసనాలను, రాతికట్టడాల విశిష్టతను యువతకు తెలియజేసినట్లు చెప్పారు.



గండికోటను సందర్శిస్తున్న విశాఖ యువత

ఎన్జీవో సంఘం అధ్యక్షుడుగా కొండూరు బలరామరాజు


బలరామరాజు


విశ్వనాథ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడుగా కొండూరు బలరామరాజు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో సహాధ్య క్షుడుగా జయచంద్ర, కార్యదర్శిగా విశ్వనాథతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాదు యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి తిమ్మారెడ్డి తెలిపారు. కోశాధికారి గా రవీంద్రనాయక్, ఉపాధ్యక్షులుగా నీలోఫర్ బేగం, రామకృష్ణ, సురేంద్రరెడ్డి, దేవదానం, జాయింట్ సెక్రెటరీలుగా కృష్ణప్ప, వెంకటలక్షుమ్మ, గౌసియా బేగం, కమిటీ మెంబర్లుగా సుబ్బయ్య, ఆంజనమ్మ, పిఆర్ వి రమణ, అరుణను ఎన్నుకున్నారు. మాజీ నేతలు వెంకటరమణ, రవిశంకర్, ప్రసాదు, రాయచోటి ఎన్జీవో సెక్రెటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు హాస్యాస్పదం

● బీసీ నేత ఇడగొట్టు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నాయకుడిని రక్షించుకోవాలన్న ఉద్దేశంతో అధికారిపై జరిగిన దాడి సంఘటపై విచారణ కోరుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి గత వారం రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో చోటు చేసుకున్న మల్లెల వెంకట్రమణ హత్య, కాటిమాయ కుంటలో కాల్పులు, గాలివీడు మండలంలో మైనార్టీలు ఉపాధి కోల్పోయిన సంఘటనలు కనిపించలేదా అని బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఈ విషయంపై ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఆదివారం ఆ సంఘం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు ఏం జరిగినా ఆయన పట్టించుకోవడం లేదన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లె సమీపంలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. బీసీ సంఘం జిల్లా నాయకులు ముంగిరి రమణయ్య కుటుంబీకులు అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించారు. ఆలయ సమీపంలో సుమారు 400 మంది భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రామాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై సుధాకర్ రెడ్డి కథనం మేరకు రాయచోటిలోని మాసాపేటకు చెందిన మనోహర్, యదీప్ లక్కిరెడ్డిపల్లి నుంచి మాసాపేటకు వెళుతుండగా కొమ్మరపల్లి బ్రిడ్జి వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కల్వర్టులో పడింది. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మనోహర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేబుల్ వైరు చోరీ

చిన్నమండెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ పసలవాండ్లపల్లెలో శనివారం రాత్రి దాదాపు ఒకటిన్నర లక్షల రూపాయల విలువ చేసే కేబుల్ వైర్లను దొంగలు చోరీ చేసినట్లు రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, రెడ్డి శేఖర్ రెడ్డికి మోటార్లను బయటికి లాగేసి కేబుల్ వైర్‌ను కట్ చేసుకుని అపహరించుకుని వెళ్లారు. అసలే వ్యవసాయంలో అంతంత మాత్రం ఆదాయం ఉన్న సమయంలో ఈ చోరీలు అదనపు భారాన్ని మోపుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ పాఠశాల.. అభివృద్ధికి దూరం!

● మౌలిక వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు


పాఠశాల ఆవరణలో పారుతున్న మురుగునీరు


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసేది ఇక్కడే..

సంబేపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కనీస వసతులు లేకపోవడంతో మండలంలోని శెట్టిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద రూ.64 లక్షలు మంజూరు కాగా, రాజకీయ కారణాలతో వెనక్కి వెళ్లిపోయాయి.

మండలంలోని శెట్టిపల్లెలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 161 మంది విద్యార్థులు ఉన్నారు. వారం తా మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే. కాగా, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తరగతి గదులు వర్షం వస్తే ఉరుస్తున్నాయి. తలుపులు, కిటికీలు కూడా సక్రమంగా లేవు. తాగునీటి సమస్య ఉంది. వంట గదులు గోడల వరకు కట్టి వదిలేశారు. దీంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. మురుగు కాలువల నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరుతుండడంతో మడుగు ఏర్పడింది. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం లేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులు బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు



పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పపడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. సమస్యలను స్థానిక నాయకులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాలకు నిధులు మంజూరు చేస్తే మౌలిక వసతులు కల్పిస్తాం.

- బాషావలి, స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె

నిధులు వెనక్కి పోయాయి

నాడు- నేడు నిధులు కింద మంజూరైన రూ.64 లక్షలు వెనక్కి పోయాయి. ప్రస్తుతం నిధులు మంజూరైతే తప్ప విద్యార్థులకు వసతులు కల్పించడం సాధ్యం కాదు. కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి విద్యార్థులకు వసతులు కల్పించాలి.

- చిన్నరెడ్డెప్ప, ప్రధానోపాధ్యాయుడు, శెట్టిపల్లె

సుగవాసి సమక్షంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి

సిద్ధవటం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ కంచుకోటగా ఉన్న మాధవరం-1 పంచాయతీ ఎస్.కె.ఆర్.నగర్‌కు చెందిన 60 పద్మశాలీయుల కుటుంబాలు టీడీపీ యువ నేత అవ్వారు రాజారాం ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి మాట్లాడుతూ పద్మశాలీలు తిరిగి సొంత గూటికి రావడం సంతోషకరమన్నారు. టీడీపీ చేనేత కుటుంబాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. భద్రాద్రి భావ నారాయణ చేనేత ట్రస్టు అభివృద్ధికి సహకరిస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య కార్యదర్శి నాగమునిరెడ్డి, గీతాంజలి, విద్యా సంస్థల అధినేత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరిచయ వేదికలతో వివాహాలు సులభతరం

రాజంపేట: వధూవరుల పరిచయ వేదికలతో వివాహాలు సులభతరం అవుతాయని టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం రాజంపేట గీతాంజలి విద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బలిజ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గీతాంజలి కళాశాల అధినేత ఎస్వీ రమణ మాట్లాడుతూ నేడు వధూవరులను వెతుక్కోవడం తల్లిదండ్రులకు భారంగా ఉందని, ఇటువంటి సమయంలో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ఎంతో ఉపయోగకరమన్నారు. న్యాయవాది నాయుని బాలాజీ మాజీ సర్పంచ్ డాక్టర్ తోటరామయ్య, చిట్వేలి మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు టీడీపీ పార్లమెంట్ లీగల్ సెల్ల అధయక్షుడు టి.లక్ష్మీ నారాయణ, రవి, రామ శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

రాయచోటి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని , జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఐసా జిల్లా నాయకులు కిరణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశ్, ఏపీఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ , వసతి దీవెన అందకపోవడంతో కోర్సు పూర్తి చేసుకున్న పలువురు ఉద్యోగాలకు వెళ్లలేక బేల్దారి పని చేసుకుంటూ కూరగాయలు అమ్ముకుంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ నెలలో ఇచ్చిన పత్రికా ప్రకటనను విద్యాసంస్థల యాజమాన్యాలు ఆ ప్రకటనలు ఏ మాత్రం లెక్కచేయడం లేదన్నారు. కోర్స్ పూర్తయినా సర్టిఫికెట్లు లేకపోవడంతో చేతికి వచ్చిన ఉద్యోగం రాకుండా పోయిందన్న బాధతో నిరుద్యోగులు ఆత్మహత్యల వైపు వెళ్తున్నాన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.3,580 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి నియోకవర్గ కార్యదర్శి కిరణ్‌కార్తీక్, నాయకులు గణేశ్, మనీ, భార్గవ్, పురుషోత్తం, శశికుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా వెంకన్న కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అవిలాల కృష్ణదాసు స్వామి

సుండుపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని చెన్నంశెట్టిపల్లె ఎల్లమ్మ ఆలయం ఎదురుగా ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొట్టి ఆదిలక్ష్మి, ఎల్లయ్య కుటుంబీకులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ వేదికపై ఆసీనులను చేశారు. తిరుపతి అవిలాల కృష్ణదాసు గురుస్వామి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తోట రవీంద్ర, చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, నాగేశ్, వెంకట్రమణ, బాలాజీ, గోవింద మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

'మానవత' సేవలు నిరుపేదలకు వరం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు నిరుపేదలకు వరం అని ఆ సంస్థ మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మానవతా విలువలపై అవగాహన కల్పిస్తామని, ప్రతిభకలిగిన ప్రభుత్వ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థుల చదువులు పూర్తిఅయ్యేంత వరకు సంస్థ అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వై ప్రసాదుయాదవ్, మానవతా సభ్యులు పాల్గొన్నారు

గంగమ్మకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి); మండలంలోని అనంతపురం గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతర సమీపిస్తుండంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. జనవరి మాసం నుంచి అమ్మవారు ప్రతి ఆదివారం ఒక్కో అలంకారంతో భక్తులకు దర్శమిస్తారు.

భలే.. మంచి చౌక బేరము!

● రూ. వందకే కిలో కోడి మాంసం ● ఎగబడిన వినియోగదారులు


చికెన్ దుకాణాల వద్ద వేచి ఉన్న వినియోగదారులు

పెనగలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోడి మాంసం వ్యాపారుల మధ్య ఏర్పడిన పోటీ వినియోగదారులకు వరంగా మారింది. వివరాలిలా ఉన్నాయి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కోడి మాంసం దుకాణాలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ దుకాణ యజమానిక ఆదివారం నాడు రూ150 కే కిలో కోడి మాంసం విక్రయించనున్నట్లు శనివారమే టాంటాం వేయించాడు. దీంతో మిగిలిన వ్యాపారులు అతనికి పోటీగా ఆదివారం రూ. 120కే విక్రయించారు. మరో దుకాణదారు వంద రూపాయలకే విక్రయిస్తుండడంతో ఆ దుకాణం వద్ద వినియోగదారులు బారులు తీరారు. ఈ దుకాణం వద్ద ఏడు గంటల వ్యవధిలో 200 కిలోల చికెన్ అమ్ముడుపోయింది. కిలో రూ.120 అమ్ముతున్న మిగతా దుకాణాల వద్ద కూడా భారీగానే అమ్మకాలు జరిగాయి. ఈ సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల్లోని ప్రజలు తండోతండాలుగా పెనగలూరు చేరుకుని మూడు నుంచి ఐదు కిలోల చికెన్ కొనుగోలు చేసి తీసుకుని వెళ్లారు. దీంతో 15 రోజుల ముందుగానే సంక్రాంతి వచ్చినట్లుందని స్థానికులు చమత్కరిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈ రోజు తన దుకాణానికి వచ్చి చికెన్ కొనుగోలు చేసిన వారందరినీ గుర్తుంచుకుని భవిష్యత్తులో కూడా వారికి రూ.150కే కిలో చికెన్ అందిస్తామని టాంటాం వేసిన వ్యాపారి ప్రకటించారు.

ఎంపీడీవోకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రామాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఎంపీడీవోపై దాడి చేసిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాధరెడ్డి కోరారు. వైసీపీ మూకల చేతిలో గాయపడి రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న ఎంపీడీవో జవహర్‌బాబును ఆదివారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోకుండా ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం ఎవరూ క్షమించరన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తన పార్టీకి జరిగిన ఘోర పరజయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులపై దాడులను పూర్తిగా మానుకోవాలన్నారు.

సిద్ధవటం: ఎంపీడీవో జవహర్ బాబును సిద్ధవటం సర్పంచ్ భవనాసి ఓబులయ్య పరామర్శించారు. వైసీపీ అధికారం పోయిన రౌడీయిజం తగ్గలేదని ఆరోపించారు. ఆయనపై దాడి చేయడం నీచమైన చర్య అని ఆక్రోషం వ్యక్తం చేశారు. ఎంపీడీవో త్వరగా కోలుకోవాలని తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి); గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసిన వారిని వెంటనే శిక్షించాలన్నారు ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రవీణ్,షంషేర్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మాతృభాషపై 'గంగనపల్లి' కవితాగానం

రాజంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అమ్మ భాషను కాపాడుకుందాం...ఆత్మాభిమానం పెంచుకుందాం అనే నినాదంతో విజయవాడలో నిర్వహిస్తున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో రాజంపేట పట్టాణానికి చెందిన తెలుగు పండితుడు, కవి గంగనపల్లి వెంకటరమణ కవితా గానం చేశారు. ఈ సందర్భంగా తెలుపుచందు అనే శీర్షికతో రచించి ఆలపించిన సీసపద్యం సభను అలరించింది తమిళనాడు, కర్ణాటక, మహరాష్ట్ర, కేరళీయులు తమ తమ భాషలను అభిమానిస్తుండగా తెలుగు వాళ్ళు మాత్రం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జి.వి. పూర్ణ చందు తదితరులు పాల్గొన్ని గంగనపల్లి వెంకటరమణను అభినందించారు.

సీఆర్‌సీ కుమారుడికి సుగవాసి నివాళి


విష్ణుస్వరూప్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ భౌతిక కాయానికి ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కడప నగరంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శించారు. అనంతరం ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రామచంద్రయ్య కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాల ని ఆకాంక్షించారు.

'సత్తెన్న కుటుంబానికి న్యాయం చేస్తాం'


సత్తెన్న తల్లికి నగదును అందిస్తున్న టీడీపీ వడ్డెర సాధికారత సమితి కన్వీనర్ వెంకట్

గాలివీడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వారంలో హత్యకు గురైన కళాకారుడు సత్తెన్న అలియాస్ వెంకట్రమణ కుటుంబానికి న్యాయం చేస్తామని టీడీపీ రాష్ట్ర వడ్డెర సాధికారత సమితి కన్వీనర్ వెంకట్ తెలిపారు. ఆదివారం ఆయన నూలివీడు పంచాయతీ కొత్తబండివాండ్లపల్లెలో సత్తెన్న కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి తల్లికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకాలు ఆడుతూ తల్లిని పోషించుకునే సత్యన్నను హత్య చేయడం అమానుష మన్నారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో చర్చించి బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సేవాదళ్ అధ్యక్షుడు పవన్‌కుమార్, స్థానిక నాయకులు జగన్నాథ, మేస్త్రి వెంకట్రమణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాయత్నం అడ్డగింత

నందలూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లతిమ్మయ్యగారి పల్లె పరిధిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చెన్నయ్యగారి పల్లెకు చెందిన కొంతమంది ప్రయత్నించారని ఈ విషయం తెలిసి తాము అడ్డుకోవడం జరిగిందనిచేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నట్లు దళిత నాయకుడుపనతల రామచంద్రయ్య తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఆదివారం నాలుగు ఎక్స్‌వేటరతో 293 సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ భూమి ఎన్.టి.పల్లె గ్రామానికి చెందిన పేద దళితులకే దక్కాలన్నారు. ఈ సంఘటనపై సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితులు పాల్గొన్నారు.

ఎక్సలెంట్ వాకర్స్ వైస్ ప్రెసిడెంట్ అవార్డు ప్రదానం


శరత్ కుమార్ రాజును సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

రాజంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్‌లో 108 మందికి మహాత్మా గాంధీ ఫెలోషిప్ ఇప్పించినందుకు వాకర్స్ ఇంటర్నేషన్ ప్రెసిడెంట్ మురళీ మోహన్ ఆదివారం శరత్ కుమార్ రాజుకు ఎక్సలెంట్ వాకర్స్ వైస్ ప్రెసిడెంట్ అవార్డును అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో శనివారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ 33వ కన్వెన్షన్‌లో ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేటలో వాకర్స్ అసోసియేషన్ వారు ఒకే రోజు ఇంతమంది సభ్యత్వాలు చేయడంతో శరత్ కుమార్ రాజుకు ప్రత్యేకంగా అభినందించారు. రాజంపేట క్రీడా మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మెడికల్ క్యాంపులు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు బీజేపీ అధ్యక్షుడిగా రెడ్డి కృష్ణ రాయల్

పెనగలూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగచర్ల మంగమాంబ పురానికి చెందిన కోనేటి రెడ్డి కృష్ణ రాయల్ మండల బీజేపీ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓబిలి అతిగారిపల్లిలోని సీతారామ కల్యాణ మండపంలో ఆది వారం నిర్వహించిన నాయకులు కార్యకర్తల సమావేశంలో జరిగిన ఈ ఎన్నికను వాక చర్ల సుబ్బారావు పర్యవేక్షించారు. అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు రాష్ట్ర హార్టి కల్చర్ కన్వీనర్ తీట శ్రీని వాసులు అసెంబ్లీ కో కన్వీనర్ గాదెల శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం మండల మాజీ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున, పణతల నరేష్, సోమశిల చంద్రమోహన్ ఎస్ నవాబ్ కరీముల్లా, ఎం శ్రీనివాసులు, మం చా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవింద స్వాములకు అన్నదానం

సుండుపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో మాజీ ఎంపీపీ శైలజ, వేణుగోపాల్ దంపతులు ఆదివారం గోవింద మాలధారులకు అన్నదానం చేశారు. సుమారు 200 మంది స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసీలకు రాయితీ రుణాలు

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 5032 మందికి రూ.79.78కోట్ల ప్రయోజనాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా రాయితీ రుణాలు అందించి బీసీ సామాజిక వర్గాల్లో వేలాదిమందికి వివిధ రకాల ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రతిపాదనలు పంపాలంటూ ఆదేశాలు ఇచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ ఐదేళ్ల పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చిన పరిస్థితి లేదు. 2014-2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన అనంతరం లోటు బడ్జెట్ ఉన్నప్పటికి బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ రాయితీ పథకాలను అమలు చేసిన పరిస్థితి ఉంది. ఇపుడు కూటమి ప్రభుత్వంలో అతిపెద్ద పార్టీగా టీడీపీ పేద ప్రజలకు జీవనోపాదులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక మిగిలింది మూడు నెలలు మాత్రమే. ఈ వ్యవధిలో సమయానికి తగిన విధంగా ప్రతిపాదనలు రూపొందించమని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం తాజా ప్రతిపాదనలు రూపందించి ప్రభుత్వానికి నివేదించింది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... బ్యాంకు లింకేజీతో కూడిన స్వయం ఉపాధి పథకాలకు బీసీ కార్పొరేషన్ రాయితీ ఇవ్వనుంది. 1550 మందికి రూ.31కోట్లు ప్రయోజనం చేకూరనుంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వనుంది. ఈ పథకం ద్వారా 61 మందికి రూ.7.33కోట్లు రుణాలు మంజూరు కానున్నాయి. పాడి పరిశ్రమ ద్వారా బీసీ సామాజిక వర్గాలకు చెందిన 500 మందికి రూ.25కోట్లు మినీ డెయిరీలు మంజూరు చేయనున్నారు. కురబ, యాదవులకు మేకలు, గొర్రెల పెంపకం కోసం 105 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.10కోట్ల రుణాలు అందించనున్నారు. మేదర, కుమ్మరి, శాలివాహనులకు చెందిన వారికి స్వయం ఉపాధి కల్పన కోసం 118 మందికి రూ.3.54 కోట్లు, బీసీ నిరుద్యోగ యువతకు జనరిక్ మెడికల్ షాపులు 32 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.56 కోట్లు, బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద ఫ్యాషన్ డిజైనింగ్‌కు 1770 యూనిట్ల కోసం రూ.4.43 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద శిక్షణ కార్యక్రమం 350 యూనిట్లకు రూ.1.75కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆసుపత్రి సెక్టార్ కింద శిక్షణ కార్యక్రమ 350 యూని ట్లు రూ.0.87కోట్లు ఖర్చు చేయనున్నారు. వడ్రంగి కింద శిక్షణ కార్యక్రమం 200యూనిట్లకు రూ.1.20కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు.

5036యూనిట్లకు రూ.79.78కోట్లు

బీసీ సామాజిక వర్గాల్లోని వివిధ ఉపకులాలకు ప్రయోజనం కలిగేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు బీసీ కార్పొరేషన్ అధికార యంతారంగం చెబుతోంది. మొత్తం 5036 యూనిట్లకు గాను రూ.79.78 కోట్లు ప్రతిపాదనలు రూపొందించి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఆర్థిక సంవత్సర చివరి నాటికి గ్రౌండింగ్ చేసే దానికి అవకాశాలు ఉన్నాయి. ముందుగా అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తు గడువు ముగియగానే అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఇప్పటికే వివిధ కులసంఘాల నాయకులు అధికారులను కలిసి నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయాలంటూ విన్నవిస్తున్నారు. సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బీసీ కార్పొరేషన్ వైపు వివిధ సంఘాల నాయకులు కన్నెత్తి చూసింది లేదు. ఇపుడు ప్రభుత్వం మారడంతో బీసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రతిపాదనలు ఆమోదించగానే యూనిట్ల మంజూరు



ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని బీసీలకు రాయితీ రుణాలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే జిల్లా కలెక్టర్ అనుమతితో అమలు చేయడం జరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

\- జయసింహ, ఈడీ,బీసీ కార్పొరేషన్

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి



వడ్డెర మహాగర్జనలో మాట్లాడుతున్న ఏపీ వడ్డెర రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి

పెద్దమండ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి సమీపంలో జిల్లా వడ్డెర సంఘం మహాగర్జన కార్యక్రమం మండల వడ్డెర సహకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వడ్డెర రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ వడ్డెర హక్కుల సాధనకు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. వడ్డెరలకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ వడ్డెరులను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారు తప్ప రాజకీయంగా గుర్తింపు ఇవ్వలేదని, రాష్ట్రంలో 40 లక్షల మంది వడ్డెరలు ఉన్నా తగిన న్యాయం జరగలేదన్నారు. జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు డేరంగుల నారాయణ, తంబళ్లపల్లి నియోజకవర్గ వడ్డెర అధ్యక్షుడు నాగమల్లప్ప, డాక్టర్ లక్ష్మీప్రసాద్, శంకరప్ప సాంబశివ, ఎంఎల్ రమణ, హరి, మేకల చలపతి, జిల్లా, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వడ్డెరలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ వసీవుల్లా బఖ్తియారి, ఎం.అబ్దుల్ రషీద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప నగరం రూట కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూట) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ ఏర్పాటు చేశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ రూట ఆధ్వర్యంలో ఉర్దూ మీడియంను అంగన్వాడీల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు స్థాపనకు, పటిష్టపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చీఫ్ పాటర్న్‌గా సయ్యద్ హిదాయతుల్లా, గౌరవ అధ్యక్షులుగా హఫీజ్, షేక్ అహ్మద్ సలహాదారులుగా డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, డాక్టర్ ఎస్.అయ్యూబ్ హుస్సేన్, రాష్ట్ర సమన్వయకర్తగా షేక్ ముహమ్మద్ అయ్యూబ్ ఎంపికయ్యారు.

గువ్వల చెరువు ఘాట్‌లో అదుపుతప్పిన లారీ

- తప్పిన పెను ప్రమాదం

సికెదిన్నె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆదివారం లారీ అదుపు తప్పి లోయలో పడిన ప్రమాదంలో డ్రైవర్ క్రిష్ణ, క్లీనర్ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె పోలీసులకు వివరాల మేరకు... కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో రాయచోటి వైపు నుంచి కడపవైపునకు జూస్ లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా ప్రహరీగోడను ఢీకొట్టి నిలిపే ప్రయత్నం చేసినప్పటికి పది అడుగుల లోయలో పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గండికోట చరిత్రను యువత తెలుసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతేశంలో సహజసిద్ధంగా ఏర్పడిన గండికోటను యువత సందర్శించడం శుభపరిణామమని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గండికోటను విశాఖ జిల్లా యువత సందర్శించారు. భారతదేశంలో సహజ సిద్ధంగా ఏర్పడిన పుణ్యస్థలం గండికోట అన్నారు. ఇతర జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సదర్శించడం వలన పురాతన కట్టడాలపైన యువతకు అవగాహన ఏర్పడుతుందన్నారు.

పెద్దదర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కడప క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కడప అమీన్‌పీర్‌దర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ముత్తవల్లి షకీల్ షఫీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పెద్ద దర్గా గౌరవాన్ని తీస్తుండడంతో దర్గా సంబంధించిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రైతు కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ

సింహాద్రిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెకుంట్లలో జరిగిన నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆదివారం పులివెందుల ఆర్డీఓ జి.చిన్నయ్య, తహసీల్దార్ నాగేశ్వరరావులు విచారణ చేపట్టారు. నాగేంద్ర సాగు చేస్తున్న చీనీ తోటను, అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నాగేంద్ర ఇంటిలో భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు నాగేంద్ర బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ సమక్షంలో నాగేంద్ర ఇంటిలోని బీరువాలో వున్న వస్తువులను ఎస్ఐ తులసీనాగేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు ఏమైనా దొరుకుతాయేమోనని బీరువాలు, ఇంటిలోని పరిసరాలు పరిశీలించారు. డిప్యూటీ తహసిల్దార్ హరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

దుద్దెకుంట్ల గ్రామంలో జరిగిన కొమెర నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నాగేంద్ర కుటింబీకుల ఆత్మహత్యలపై పౌరహక్కుల సంఘం కడప జిల్లా శాఖ



నాగేంద్ర తోట వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య,రెవిన్యూ అధికారులు

నిజ నిర్ధారణలో తేలిన వాస్తవాలను ఆయన విలేకరులకు వివరించారు. దీనికంతటికి కారణం నాగేంద్రకు ఉన్న ఒకటిన్నర ఎకరాల పొలమే కాకుండా 13 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. గత ఆరు ఏడేళ్లుగా పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెడుతూ సుమారు 30 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చినవారు వత్తిడి చేయడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దిక్కుతెలియనిస్థితిలో కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి వ్యవసాయాన్ని నమ్ముకుని పెట్టుబడి కూడా రాకపోవడంతో నాగేంద్ర కుటుంబం ఆత్మ హత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే పాలకులు రైతాంగం కోసం వ్యవసాయానికి పెట్టుబడి నిధులు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డయ్య, సహాయ కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శించిన మంత్రులు, పార్టీల నేతలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. విష్ణుస్వరూప్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కడపకు తీసుకొచ్చారు. ఆదివారం కో-ఆపరేటివ్ కాలనీలోగల సీఆర్‌సి గృహంలో భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. కన్నకొడుకు మృతితో తీవ్ర మనోవేదనకు గురైన రామచంద్రయ్యను పలువురు నేతలు పరామర్శించారు. వారిలో రాష్ట్ర మంత్రి ఫరూఖ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బాబూరావు, టింబర్ డిపో శ్రీనివాసులు, సంగం అదినేత నసీరుద్దీన్, బద్వేల్ టీడీపీ నాయకులు రాంబాబు, వైసీపీ



రామచంద్రయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఫరూఖ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

నాయకులు అంజాద్‌బాష, నగర మేయర్ సురేష్ బాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తులసిరెడ్డి, మాజీ నాయకులు నజీర్ అహ్మద్, జనసేన జిల్లా కన్వీనర్ సుంకర శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు వీవీ చలపతి, పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, రామసుబ్బారెడ్డి, (వైసీపీ), బత్యాల చెంగల్‌రా యులు, (టీడీపీ), రమేష్‌రెడ్డి (వైసీపీ), ఆరిఫుల్లా (టీడీపీ) తదితరులతో పాటు ఎలువురు కార్పొరేటర్లు, అభిమానులు, మిత్రులు, బంధువులు ఉన్నా రు. కాగా, ఆదివారం మధ్యాహ్నం చలమారెడ్డిపల్లెలోని రామచంద్రయ్య సొంత పొలంలో విష్ణుస్వరూప్ అంత్యక్రియులు నిర్వహించారు.

ఉద్యోగావకాశాలకు క్రీడలు దోహదం

- జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగావకాశాలు పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని.. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ కోటాను ఉద్యోగ కల్పనలో అమలు చేస్తున్నదని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో 50వ జిల్లా కబడ్డీ జూనియర్ బాల, బాలికల ఎంపికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే జనవరి 3 నుంచి 6వ తేదీ వరకూ కర్నూలు పట్టణంలో జరుగ నున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి వుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి జనార్థన్, కో-ఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

బాలుర విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

పవన్, వంశీ, విజయేంద్రప్రకాష్, బి.లోకేష్, బి.శివకుమార్, టి.ఉదయ్‌కుమార్, డి.నవనీత్, పి.సుదర్శన్, జి.రెడ్డి ప్రసాద్, డి.వర్ధన్, ఎస్.విష్ణు, ఎస్.రిహాన్ బాషతో పాటు స్టాండ్ బైగా ఎస్.చంటి, వై. శ్రీవిష్ణు, కె. మణికంఠ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో ...

పి.నాగశృతి, ఎస్.శ్యామల, కె.వెంకట పల్లవి, ఎస్.నవనీత, కె.హేమవర్షిణి, బి.భవానీ, పి.అనుదీక్షిత, ఎం.ప్రమీల, సాయిహర్షిత, గురు స్పందన, టి.సౌమ్య, శ్రీ వర్షిత, జె.అనూషతో పాటు స్టాండ్‌బైగా ఆర్.అనురాధ, టి. శిరీష, బి.నిహితరెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలు



డాక్టర్ రవికుమార్
సూపరింటెండెంట్
ప్రభుత్వ ఆస్పత్రి, వాల్మీకిపురం

ముఖాముఖి

వాల్మీకిపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన సేవలందించడం జరుగుతోందని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆస్పత్రిలో వైద్యం, సౌకర్యాల కల్పనపై ఆయన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్రశ్న: ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారా?

జవాబు: కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నాం.

ప్రశ్న: ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా?

జవాబు: ప్రజలకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. పాము, కుక్క కాటుకు సైతం మందుల కొరతలేకుండా, 175 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న:గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లల విషయంలో ఎలాంటి వైద్యం అందిస్తున్నారు?

జవాబు:ఇటీవల ప్రారంభించిన నూతన భవనాలలో బాలింతలు, గర్భవతులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. ఎన్‌బీహెచ్‌సీ ద్వారా చిన్న పిల్లలకు ప్రత్యేకించి వార్డులు, కేర్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: 50పడకల ఆస్పత్రిలో రెఫరల్ కేసులను అడ్డుకుంటున్నారా ?

జవాబు: అత్యంత క్లిష్టతర పరిస్థితులలో తప్ప ప్రతి కేసు ఇక్కడే చూస్తూ వైద్య చికిత్సలు చేస్తున్నాం.

ప్రశ్న:నిరుపేదలకు అందుబాటులో సర్జరీలకు సౌకర్యాలు ఉన్నాయా?

జవాబు: ఎన్‌టీఆర్ వైద్య సేవలో భాగంగా జనరల్ సర్జరీ, ఎముకల చికిత్స, గర్భిణులకు అందుబాటులో వైద్యులు ఉన్నారు. కార్పొరేట్‌లో కంటే మెరుగ్గా అత్యాధునిక ప్రమాణాలతో రెండు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి.

ప్రశ్న: ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులు ఉన్నారా?

జవాబు: ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉంటున్నారు. అత్యవసర సమయాలలో డాక్టర్ అందుబాటులో ఉన్నారు.

మల్లయ్యకొండకు వంటపాత్రలు వితరణ



ఆలయానికి వంట పాత్రలను అందచేస్తున్న దాతలు

తంబళ్లపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయానికి దాతలు వంట ప్రాతలు వితరణ చేశారు. తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లె పంచాయతీ తరుగువారిపల్లెకు చెందిన దాతలు అక్కెమ్మగారి భువనేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రూ.30 వేలు విలువ చేసే పెద్ద స్టవ్‌లు, వంట పాత్రలు, దుప్పట్లను ఆలయ అధికారులకు అందచేశారు.

మరమ్మతులకు వచ్చి.. మట్టిలో కలిసిన ట్రాక్టర్



మదనపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి మరమ్మతులు చేస్తే, వినియోగంలోకి వచ్చే ట్రాక్టర్‌ను మూలకు తోసేయడంతో అది మట్టిలో కలిసిపోవడానకి సిద్ధంగా ఉంది. మాజీ సైనిక సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు పోరాట ఫలితంగా మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైంది. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులతో ట్రాక్టర్ ఇంజన్, ట్యాంకర్ మంజూరు చేశారు. దీంతో పదేళ్లపాటు సేవలందించిన ట్రాక్టర్ తర్వాత షెడ్డుకు చేరింది. సరైన నిర్వహణ లేకపోవడంతో ట్రాక్టర్ ఇంజన్ పంచాయతీ కార్యాలయం కిందకు చేరగా, ట్యాంకర్ రంగారెడ్డి కాలనీలో రోడ్డు పక్కన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతోంది.

ఆపరేషన్ వికటించి వృద్ధుడు మృతి

●ఆస్పత్రి వద్ద మృతదేహంతో బంధువుల ఆందోళన





మృతుడు ఆర్ వెంకటేశ్, ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక పటేల్ రోడ్డులోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి మృతుడి బంధువులు మృతదే హాన్ని ఆస్పత్రి ముందు ఉంచి ఆందోళన చేపట్టారు. బాధితుని వివరాల మేరకు పెద్దపంజాణి మండలం, రాయలపేట పంచాయతీ నాగిరెడ్డిపల్లెకు చెందిన ఆర్ వెంకటేశ్ (58)రెండు రోజుల క్రితం గుండె నొప్పితో మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్ రోగిని పరీక్షలు నిర్వహించి అత్యవసరంగా స్టంట్ వేయాలని తెలపడంతో అందుకు అంగీకరించి డబ్బు కట్టి యాంజియో గ్రామ్‌చేయించారని తెలిపారు. అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లిన వెంకటేశ్‌కు గుండెలో నొప్పి రావడంతో తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాధితులు మెరుగైన వైద్యం కోసం సిటీకి పంపాలని కోరినా డాక్టర్ పెడ చెవినపెట్టి రెండోసారీ ఆపరేషన్ చేస్తానని చెప్పి తిరిగి ఆపరేషన్ చేశాడు. ఈ క్రమంలో ఆపరేషన్ చేస్తున్న సమయంతోనే రోగికి హార్ట్‌అటాక్ రావడంతో అక్కడే ఆపరేషన్ థియేటర్‌లో మృతి చెందాడు. వెంకటేశ్ మృత దేహాన్ని బంధువులకు కూడా చెప్పకుండా హడావుడిగా అంబులెన్స్ ఎక్కించే ప్రయత్నం చేశాడు డాక్టర్, దీనికి బంధువుల ఆవేశంతో మృతదే హాన్ని ఆస్పత్రి గేటు ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. డాక్టర్ కావాలనే మా తండ్రిని చంపేశార ని మృతుడి కుమారుడు గణపతి ఆరోపణ చేశారు. గంటసేపు ఆందోళన చేయగా టూటౌన్ సీఐ రామ చంద్ర అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు విచారణ చేస్తునట్లు సీఐ తెలిపారు.

రేపు రాత్రి రోడ్లపై సంబరాలు నిషేధం

● వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు



వాల్మీకిపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31వ తేదీ (మంగళవారం) అర్ధరాత్రి రోడ్లపై సంబరాలు పూర్తిగా నిషేధమని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలు, సంబరాలు పూర్తిగా ఇళ్లకే పరిమితం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత రోడ్లపై బైక్‌లతో శృతి మించి శబ్దాలు చేయడం, రహదారులపై కేకులు కట్ చేసి వాహనాలకు ఇబ్బందులు కలిగించడం లాంటివి జరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత బైక్‌లలో రోడ్లపై తిరుగుతూ కనిపిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల వ్యాప్తంగా గట్టి నిఘా పెట్టడం జరిగిందని న్యూ ఇయర్ వేడుకల పేరుతో రోడ్లపై తిరుగుతూ కనిపిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలు కూడా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ములకలచెరువులో పూర్వ విద్యార్థుల సందడి



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1984-85లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఇప్పుడు కలుసుకున్నారు. 39 ఏళ్ల తురువాత తిరిగి ఇప్పుడు కలుసుకోవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. అందరూ ఒక చోట కూర్చొని చదువుకున్న సమయంలో చేసిన అల్లరిని గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి ఒకరికొకరు చెప్పుకున్నారు. అలాగే చదువు చెప్పిన ఉపాధ్యాయులు వరదాచార్యులు, మునాఫ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తోట గిరిధర్, మొబీన్‌బాషా, ప్రసాద్, సత్యనారాయణ, రమణమూర్తి, రమేష్, నగేష్, నాగేంద్ర, చంద్ర, విజయరెడ్డి, రెడ్డెమ్మ, నిర్మల, శశికళ, లలిత, ఉమాదేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కత్తి రామలింగా రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న కత్తి రామలింగా రెడ్డి

పీలేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ప్రముఖ జానపద సీనియర్ కళాకారుడు, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర నాట్యకళామండలి వ్యవస్థాపకుడు కత్తి రామలింగారెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. జానపద కళల పరిరక్షణతో పాటు వాటిని ఈ తరం కళాకారులకు నేర్పించేందుకు నాట్యకళామండలి స్థాపించి సేవ చేస్తున్నందుకు ఆయనకు హైదరాబాదులోని మనం ఫౌండేషన్ వారు గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. హైదరాబాదులో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

కారుప్రమాదంలో వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక తట్టివారిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన కారుప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలుకాగా యలకపల్లె గంగాధర్ (25) మృతి చెందాడు. పలమనేరు నుంచి మదనపల్లె లోని బాబుకాలనీలోకి గంగాధర్ (25) అతని భార్య రెడ్డి రేఖా(21)వస్తుండగా కారు ముందుగా బైక్‌ను ఢీకొట్టి అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న బంకును కారుఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యలకపల్లె గంగాధర్ (25) అతని భార్య రెడ్డి రేఖా(21) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, టూటౌన్ పోలీసులు అక్కడి చేరుకుని క్షతగాత్రులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గంగాధర్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేట్టారు.

బిడ్డకు మొక్కు చెల్లించకుండా పోతివా తల్లీ...

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మదన పల్లె అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):బిడ్డకు మొక్కు తీర్చకుండా పోతివా.. తల్లి అంటూ కూతరు లావణ్య మృతితో తల్లి శ్యామల రోధించడం అందరినీ కంటతడిపెట్టించింది. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో రామి రెడ్డి లేవుట్‌లో కాపురం ఉన్న శ్యామల కుమార్తెను తన తమ్ముడైన మధుకర్‌కు మూడేళ్ల ముందర వివాహం చేశారు. ఇద్దరి మధ్య వివాదం ఉండడంతో కుమార్తె అమ్మవారి ఇంటి కి వచ్చింది. ఆదివారం అమ్మ శ్యామలతో మాట్లాడి తన కమార్తె నేహరికకు ఏడాదన్నార ఏళ్లు. తంబళ్లపల్లె మల్లయ్యకొండలో మొక్కు తీర్చుకోవాలని మాట్లా డు కుని పక్క వీధిలోని అత్తవారి ఇంటికి లావణ్య వెల్లింది. అంతే అక్కడ ఏమి జరిగిందో ఏమో లావణ్యకు మూర్చ వచిందిని ఫోన్ చేశారు అత్తింటివారు. అక్కడ వెళ్లి చూడగా స్పృహలేకుండా పడిఉన్న కూతురుని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వన్ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, డి సెంబరు 29(ఆంధ్రజ్యోతి) స్థానిక బసినికొండలో బంకు వద్ద ఇద్దరు గొడవ పడుతుంటే ఎందుకు అని అడిగి వారిని దూసించారు. అక్కడ పవన్(34), చాంద్‌బాషా(34)సోయాల్(24)షాజ్‌హాన్(25) వీరిని బసినికొండకు చెందిన సురేష్ మరో ఇరవైమంది కలిసి కొట్టి గాయపర్చారు. గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువరైతు ఆత్మహత్యాయత్నం పరిస్థితి విషమం

గుర్రంకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):పొలాలకు వెళ్లే దారి సమస్యను విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదంటూ ఓ యువ రైతు మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన క్రిష్టాపురంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు మండలంలోని సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురంకు చెందిన పెద్దిగాని జలంధర్ కుమారుడైన పెద్దిగాని సుదర్శన్(27)కు సర్వే నెంబరు 316లో 1.50 ఎకరాల్లో వ్యవసాయ పొలం ఉంది. ఈ పొలం వద్దకు వెళ్లడానికి తమ పూర్వీకుల నుంచి దారి ఉండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ కొంత కాలంగా దారిని మూసివేసిందన్నారు. ఈ దారి గుండా వ్యవసాయ పొలాలకు వెళ్లే సుమారు పది మంది రైతులు పలుమార్లు అధికారులకు దారి సమస్య తీర్చాలని ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం దారి విషయమై మాట్లాడుతుండగా దారి ఆక్రమించిన మహిళ సుదర్శన్‌పై దాడికి పాల్పడింది. ఈ విషయమై సుదర్శన్ ఈ నెల 23న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ సుదర్శన్ చేసిన ఫిర్యాదును ఆరు రోజులు గడిచిన పట్టించుకోకపోవడంతో మనస్థాపం చెందిన సుదర్శన్ ఆదివారం ఇంటి వద్ద పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇద్దరు మహిళల ఘర్షణ.. వ్యక్తిపై కొడవలితో దాడి

తంబళ్లపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మంచి నీటి కుళాయి వద్ద ఇద్దరు మహిళలు గొడవ పడిన సంఘటనలో.. ఓ మహిళ మామపై కొడవలితో దాడి చేసిన సంఘటన ఆదివారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెలో మంచి నీటి కుళాయి వద్ద అదే గ్రామానికి చెందిన హసీనా బట్టలు ఉతుకుతుండటంతో పక్క ఇంట్లో ఉన్న కవిత ప్రశ్నించింది. దీంతో ఇద్దరు మహిళలు గొడవ పడ్డారు. కవిత మామ గంగిరెడ్డి(70) హసీనాను మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న హసీనా గొడవ విషయం శనివారం రాత్రి నల్లచెరువులో ఉన్న సోదరులకు ఫోన్ ద్వారా తెలిపింది. ఆదివారం ఉదయం హసీనా సోదరులు, కుటుంబసభ్యులు గంగిరెడ్డిపల్లెకు వచ్చి ఇంట్లో ఉన్న కవిత, గంగిరెడ్డిపై కొడవలితో దాడి చేశారు. ఈ దాడిలో గంగిరెడ్డి కాలుకి తీవ్ర గాయమైంది. బాధితులు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు అక్కడికి వచ్చే లోపు హసీనా, సోదరులు పరారయ్యారు. గాయపడిన గంగిరెడ్డిని కుటుంబసభ్యులు హుటాహుటిన తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం మదపల్లెకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదైన యువకుడు అరెస్ట్

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నమోదైన యువకుడు అరెస్టు అయిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పీటీఎం ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు...ఇటీవల కందుకూరు గ్రామానికి చెందిన నరసింహులు అనే యువకుడు ఓ బాలికను మాయ మాటలతో తీసుకెళ్లిపోయిన కేసులో యువకుడిపై పోక్సో కేసు నమోదు అయ్యింది. దీంతో యువకుడు నరసింహులు తప్పించుకుని తిరుగుతుండగా ఆదివారం కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లె క్రాస్ వద్ద యువకుడు ఉన్నాడన్న సమాచారం అందుకున్న డీఎస్పీ కొండయ్య నాయుడు, ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి నరసింహులును అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మహిళపై దాడి..ముగ్గురిపై కేసునమోదు

బి.కొత్తకోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ పరిధిలోని మల్లూరువారిపల్లెకు చెందిన ఆకుల సురేష్‌భార్య సుమంగళ(26)అనే మహిళపై దాడి జరిగింది. అదే గ్రామానికి చెందిన చంద్రమోహన్, ప్రకాష్, అరుణ అనే వ్యక్తులు దాడిచేసి కట్టెలతో కొట్టి రక్తగాయాలు చేయడంతో పాటు దుర్భాలాడారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం పై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగానాథ్‌బాబు తెలిపారు. అదే విధంగా బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని నక్కరాజుపల్లి క్రాస్ వద్ద ఎగువ చంద్రమాకులపల్లెకు చెందిన ప్యాయల రెడ్డిశేఖర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన ప్యాయల మధుకర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలు దాడిచేసి గాయపరిచారన్న ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ అయిన అంగన్‌వాడీ పోస్టులకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సుజాత ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 16 పోస్టులు వుండగా అందులో అప్పారావుతోట, వేంపల్లె, కురవపల్లె, ఊలపాడు కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు ఖాళీగా వున్నాయన్నారు. వీటితో పాటు జుడీషియల్‌కాలని, రామ్‌నగర్, బసినికొండకాలని, వీఅండ్‌టీ కాలని, బాపన కాలువ, కోటావారిపల్లె, రెడ్డివారిపల్లె, కురవపల్లె, ఆర్.కమతంపల్లె, కొండూరు, ఎర్రబోయనపల్లె కేంద్రాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు, జంగాలపల్లెలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా వుందన్నారు. అర్హత గల వారు జనవరి 2వతేది సాయంత్రం 5గంటల లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీవో కోరారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో నాగవేణి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉన్న వివాహం అయిన మహిళలు అర్హులన్నారు.

పీలేరులో: పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాల్లోని పలు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న సీడీపీవో రాజమ్మ తెలిపారు. కలకడ మండలంలో రెండు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, పీలేరు మండలంలో మూడు, కేవీపల్లెలో ఒకటి, కలకడలో ఒకటి మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి 2జూ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు.

రామసముద్రంలో: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సుజాత తెలిపారు. 21నుంచి 35ఏళ్లలోపు వయస్సు ఉండి వివాహితులైన స్థానిక మహిళలు అర్హులని ఆమె పేర్కొన్నారు. జనవరి 2తేదీలోపు మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో డిప్యూటీ సీఎం పవన్ రికార్డు



డిప్యూటీ సీఎం చిత్రపటానిక క్షీరాభిషేకం చేస్తున్న షైపోర్సు మహేష్ జనసైనికులు

మదనపల్లె, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సిమెంటు రోడ్లు మంజూరు చేయడంలో, వాటిని నిర్మించడంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రికార్డు సృష్టించారని జనసేన సంయుక్త రాష్ట్ర కార్యదర్శి షైపోర్సు మహేష్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం మరోరికార్డుగా పేర్కొన్నారు. ఈసందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే 11072 సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తి చేసినఘనత పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా అరుదైన గౌరవం దక్కిందన్నారు. గత వైసీపీ పాలన అయిదేళ్లలో అయిదువేల రోడ్లు కూడా వేయలేకపోయారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నారాయణ, మహిళా నాయకురాలు శోభ భవ్య, సందీప్‌రెడ్డి, రమణారెడ్డి, చిరంజీవి, అప్సర్‌బాషా, నాగేంద్ర, దేవేంద్ర, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుదాం



ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

మదనపల్లె టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై పోరాటానికి విద్యార్థులు, మేధావులు కలసి రావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లెలో ప్రైవేటుఫంక్షన్‌హాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ రెండో రోజున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా తల్లికి వందనం నిధులు విడుదల చేయలేదని, దీని వలన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేశ్, జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు రమణ, సీపీఎం నాయకులు హరినాథశర్మ, శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్‌మోహన్, జయబాబు, గిరి, అఫ్రీద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సంఘీభావ ర్యాలీ



హైందవ శంఖారావం ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ఐక్యవేదిక సభ్యులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభకు సంఘీభావంగా ఆదివారం మదనపల్లె పట్టణంలో విశ్వహిందూపరిషత్ ఐక్యవేదిక సభ్యులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపం నుంచి ర్యాలీ ప్రారంభమై దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ దేశంలోని దేవాలయాలను, హిందువులను కాపాడుకోవడానికి విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను ప్రతి ఇక్క హిందువు హాజరై తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు బండిబాలాజీ, బర్నేపల్లె రవికుమార్, బంది ఆనంద్, వరదారెడ్డి నారథరెడ్డి, లక్ష్మీపతి, భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె జనసేన నేత శ్రీరామరామాంజనేయులు ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వం ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అందులో 70మందికి పైగా జనసైనికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని మట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో రక్తం కొరత అని తెలుసుకున్న జనసేన నేత శ్రీరామరామాంజనేయులు రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిల్లే రెడ్డిప్రసాద్, మార్పూరి నాగార్జునబాబు, జనసేన నాయకులు జగదీష్‌బాబు, నాయని సోమశేఖర్, కుమార్, శంకర్, సుప్రజ, జనసైనికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాల నమోదు



టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాకంగా చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు తుది దశకు చేరకున్నా ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లె మండలం, కొండామరిపల్లె గ్రామంలో సత్యసాయి కాలనీలో టీడీపీ నాయకులు బోనాసి జాన్‌బాబు, పరు పుల జయరాం ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలు విరివిగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ 45 ఏళ్ల సుధీర్ఘ చరిత్ర కలిగిన టీడీపీ విశేష ప్రజాదరణ పొందుతోందన్నారు. సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ. 5లక్షల ప్రమాదబీమా, సంక్షేమపథకాలు వస్తాయని పేర్కొన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనల మేరకు నిర్విరామంగా సభ్యత్వ నమోదు చేపట్టాని, రేపటితో పార్టీ సభ్యత్వ నమోదు గడువు ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తిమ్మరాయప్ప, శ్రీనివాసులు, ఆవులరెడ్డెప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన, దళితులపై దాడులను అరికట్టాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 29(ఆం ధ్రజ్యోతి):బహుజనలు, దళితులపై దాడు లను అరికట్టాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బందెల గౌతమ్‌కుమార్ పేర్కొ న్నారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యా లయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న వైసీపీ నాయకులు గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేసిన సంఘటనకు చలించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించడాన్ని బీఎస్పీ స్వాగతిస్తోందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమ ణ, శ్రీనాథ్, లక్ష్మీపతి, సంధ్య, శివ, ప్రశాంత్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

పీలేరు రచయితలకు ఘనసన్మానం



నిర్వాహకుల నుంచి సన్మానం అందుకుంటున్న పీలేరు రచయితలు

పీలేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో పీలేరుకు చెందిన రచయితలను ఘనంగా సన్మానించారు. విజయవాడలోని కాకరపర్తి భావనారాయణ కళాశాలలో ఆదివారం జరిగిన 'తెలుగు భాషా వికాసం-తెలుగు జాతి ప్రకాశం' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని పద్యాలు వినిపించినందుకు మహాసభల నిర్వాహకులు మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్రరావు, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ ఘనంగా సన్మానించారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో సన్మానం అందుకున్న జలకనూరి మురళీధర్ రాజు (సీఆర్‌పీ), సరస్వతీ శ్రీరాములు రాజు(విశ్రాంతఉపాధ్యాయుడు), వీజీ నటరాజన్(హెచ్‌ఎం)లను స్థానిక తెలుగు భాషా పరిరక్షణ సమితి సభ్యులు అభినందించారు.

2న ములకలచెరువు మండల మీట్

ములకలచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జనవరి 2తేదీన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో దివాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.